క్లుప్తంగా

చురుగ్గా వంతెన నిర్మాణం



బలిజపాలెంలో గెడ్డపై చురుగ్గా సాగుతున్న వంతెన నిర్మాణం

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలోని రామాలయం వద్ద ఉన్న గెడ్డకు రిటర్నింగ్ వాల్‌తో పాటు వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. దీంతో గతంలో గ్రామంలోకి వచ్చేవారు ఇబ్బందులు పడేవారు. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టినట్టు ఎంపీటీసీ మామిడి లక్ష్మి తెలిపారు. ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల డీజీఎంపీ నిధుల్లో భాగంగా రూ.2.5 లక్షలతో వంతెలను నిర్మించనున్నట్టు చెప్పారు.

అప్పన్న సన్నిధిలో సంజయ్‌కుమార్



సంజయ్‌కుమార్‌కి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం అండర్ సెక్రటరీ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నను దర్శించుకున్న చిరంజీవిరెడ్డి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చిరంజీవిరెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ చిరంజీవి రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ సునీల్ అందజేశారు.

ఆక్రమణల తొలగింపు



వెదుళ్లనరవలో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం

సబ్బవరం: జీవీఎంసీ పరిధిలోని వెదుళ్లనరవలోని గెడ్డవాగుపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది గురువారం తొలగించారు. సర్వే నంబర్ 98లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ బి. సత్యనారా యణ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో వెంకటేష్‌లు జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు, వీఆర్ఏ అప్పలరాజు ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు.

కల్వర్టు నిర్మాణం నిలిపివేత



అక్రమ కల్వర్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ శ్రీకిరణ్, ఏఈ రామలక్ష్మణ్



గెడ్డ వాగుపై చేపట్టిన కల్వర్టు నిర్మాణం

- ఆర్డీవో అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు తప్పవు
- ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీకిరణ్

వరవాడ : గాజువాక–యలమంచిలి రహదారిలో వరవాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 304లోని గెడ్డవాగుపై అక్రమంగా నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణం పనులను ఆర్డీవో అనుమతి ఇచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించామని ఇరిగేషన్‌శాఖ డీఈ శ్రీకిరణ్ చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా గెడ్డ వాగుపై నిర్మిస్తున్న కల్వర్టును ఇరిగేషన్‌శాఖ డీఈ శ్రీకిరణ్, ఏఈ రామలక్ష్మణ్‌లు గురువారం పరిశీలించారు. సదరు సర్వే నంబరులోని గెడ్డవాగును ఆక్రమించి ఓ రియల్టర్ భారీ కల్వర్టును నిర్మించడానికి రంగం సిద్ధం చేసి ఇటీవల పనులు ప్రారంభించాడు. అక్రమ కల్వర్టు నిర్మాణంపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రెవెన్యూ అధికారులు స్పందించి పనులను తాత్కాలికంగా నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ గెడ్డవాగును ఆనుకొని రైతులకు చెందిన భూములతో పాటు రియల్ ఇస్టేట్ వ్యాపారులు కొంత భూమిని కొనుగోలు చేశారు. రియల్టర్లు కొనుగోలు చేసిన భూములను అధిక ధరలకు అమ్ముకోవాలంటే రహదారి మార్గం చూపించాలి. అందువల్ల సదరు రియల్టర్ 2021లో ఇరిగేషన్ శాఖ అధికారులకు అనుమతి మంజూరు చేయాలని విన్నవించుకొన్నాడు. అప్పట్లో కొన్ని షరతులతో కూడిన పర్మిషన్‌ను (ఎన్‌ఓసి) ఇరిగేషన్‌శాఖ మంజూరు చేసింది. కానీ ఇరిగేషన్‌శాఖ షరతులకు వ్యతిరేకంగా కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టడమే కాకుండా ఆర్డీవో అనుమతి పొందకుండా నిర్మాణ పనులు ప్రారంభించాడు. దీంతో ఆగ్రహించిన ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం గెడ్డవాగుపై జరుగుతున్న అక్రమ కల్వర్టును పరిశీలించి నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేశారు.

విరుద్ధంగా నిర్మాణం : ఇరిగేషన్ డీఈ శ్రీకిరణ్

ఇరిగేషన్‌శాఖ మంజూరు చేసిన షరతులకు విరుద్ధంగా గెడ్డవాగుపై జరుగుతున్న కల్వర్టు నిర్మాణం పనులను తాత్కాలికంగా నిలిపివేశాం. నిబంధనల ప్రకారం రైతులకు అనుకూలంగా ఉండేవిధంగా గెడ్డ వాగుపై మూడు పైపులతో 7.5 మీటర్ల వెడల్పుతో కల్వర్టు నిర్మించాల్సి ఉంది. కానీ 5 భారీ పైపులతో 12.5 మీటర్ల వెడల్పుతో కల్వర్టు నిర్మించారు. కల్వర్టు నిర్మాణ పనులను ఆర్డీవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయాలి. కానీ అంతకుముందుగానే పనులు ప్రారంభించారు. ఆర్డీవో అనుమతి లేకుండా నిర్మాణం పనులు చేపడితే చర్యలు తీసుకొంటాం.

సింహగిరిపై శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి



ముత్తంశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న సింహగిరి వర్తకులు

సింహాచలం : సింహగిరి వర్తకుల మనోభావాలను అర్థం చేసుకుని ఆమోదయోగ్యమైన స్థలంలో శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని సింహగిరి వర్తసంఘం ప్రతినిధులు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. నగరంలో గురువారం ముత్తంశెట్టిని కలిసిన వర్తసంఘం నాయకులు, వర్తకులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. సింహగిరినే నమ్ముకుని తామంతా తరతరాలుగా వ్యాపారాలు సాగిస్తున్నామని తెలియజేశారు. అప్పట్లో సింహగిరి రాజగోపురం ఎదురుగా ఉన్న మార్గంలో ఉన్న తమ ఇళ్ల ముందే వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవించే వాళ్లమన్నారు. ఆ తర్వాత సింహగిరి అభివృద్ధికి తామంతా సహకరించి బాబుగారి దొడ్డిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు మారడం జరిగిందన్నారు. మళ్లీ 2008లో ప్రారంభమైన సింహగిరి దివ్యక్షేత్రం అభివృద్ధి పనులకు కూడా ఎలాంటి అడ్డంకులు చెప్పకుండా నిర్వాసితులమంతా కొండదిగువకు వెళ్లడం జరిగిందన్నారు. నిర్వాసితులకు తాత్కాలికంగా సింహగిరిపై బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ను షెడ్‌ల రూపంలో నిర్మించి ఇచ్చారన్నారు. ఆ ప్రాంతంలో వ్యాపారాలు సరిగ్గా జరగకపోయినా అధికారుల నిర్ణయానికి కట్టుబడి అక్కడే వ్యాపారాలు సాగిస్తున్నామని ముత్తంశెట్టి దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాకుడా మూడేళ్లకోసారి 50 శాతం అద్దె పెంచుతున్నా భరిస్తూ వస్తున్నామన్నారు. చాలా మంది వర్తకులు అప్పులతో సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనుల్లో 5కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక చేసిందన్నారు. తమకు ఆమోదయోగ్యమైన ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. ఈసందర్భంగా రెండు స్థలాలను సూచించారు. దక్షిణ రాజగోపురం నుంచి భక్తులు బయటకు వెళ్లే మార్గంలోకాని, మే ఐ హెల్ప్ యూ కేంద్రానికి వెనుక ఉన్న తాత్కాలిక పార్కింగ్ వద్ద కాని నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించితే తమకు మేలు జరుగుతుందని ముత్తంశెట్టికి విజ్ఞప్తి చేశారు. దివ్యక్షేత్రం అభివృద్ధికి సహకరించిన తమకు అనుకూలమైన స్థలంలోనే నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇస్తామని అప్పట్లో అధికారులు హామీని కూడా ఇచ్చారన్నారు. అలాగే 67 దుకాణాలు ఒకే పొడవు, వెడల్పుతో నిర్మించడం వల్ల దుకాణదారుల మధ్య ఎలాంటి మనస్పర్థలు ఉండవన్నారు. మూడేళ్లకోసారి అద్దెను 50శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని కూడా పునరాలోచించాలని వర్తకసంఘం ప్రతినిధులు సానబోయిన రాజు, కర్రి సత్తిబాబు, మొగ్గ కిరణ్ తదితరులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : 11 కేవీ గొరపల్లి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. కరకవాణిపాలెం, గంగాంపేట, గొరపల్లి, గొల్లలపాలెం, గవరపాలెం, సంతపాలెం, కోట్నివాణిపాలెం, వెల్ఫేర్ కళాశాల, హరవర్ధన్ నగర్, సాధుమటమ్, ఏకలవ్య కాలనీ, బాపూజీనగర్, సాయిరామ్ లేఅవుట్, ఎన్‌టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

సింహాచలం : స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సూచించారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే ఆటోలను గురువారం ఆపి డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారిని ఆటోలో తీసుకెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలను ఆటోల వెనుకభాగంలో కూర్చోపెట్టొద్దన్నారు.

నేడు 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పంపిణీ

సబ్బవరం : సబ్బవరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు ఇంటింటికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులకు స్వర్ణపుష్పార్చన చేస్తున్న అర్చకుడుప్రదక్షిణ



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతోప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేణపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజింపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకుడు

'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్'పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాషరావు సంయుక్తంగా రచించిన 'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్'పుస్తకాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ అభినందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపయుక్తంగా పాఠ్యప్రణాళిక రచన చేయడం మంచి పరిణామమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థులకు విద్యను అందించడం, వారు స్వశక్తిగా ఎదిగే విధంగా తీర్చిదిద్దడం ఎంతో అవసరమన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న రామానుజమ్

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై గురువారం వెంకన్న కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస్య పూజల్లో భాగంగా ఈకార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవిసమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐదు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : పెందుర్తి మండలంలోని రాజయ్యపేట వద్ద 220 కేవీ ట్రాన్స్‌మిషన్ షిఫ్టింగ్ పనులు కారణంగా ఈనెల 5వతేదీ నుంచి 9వ తేదీ వరకు రాజయ్యపేట గ్రామానికి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఏఈ బోకం రవి తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



తవ్వవానిపాలెంలో పచ్చిరొట్ట ఎరువుల క్షేత్రాలను పరిశీలిస్తున్న ఏడీ రామారావు తదితరులు

సబ్బవరం: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. రామారావు తెలిపారు. మండలంలోని తవ్వవానిపాలెంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు సూచనలు, సలహాలను అందించారు. వరి, గంటి పంటల సాగు పద్ధతులను, ఆచరించాల్సిన విధానాలపై చర్చించారు. రైతులు వరి పంటకు ముందు పచ్చరొట్ట ఎరువులను వేసుకోవడం మంచి సంప్రదాయమని తద్వారా భూమిని సారవంతం చేయడంతో పాటు నేలను పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులు వేసుకొన్న వరి నారుమడులను పరిశీలించారు. చాలా నారుమడులలో ఇనుపధాతు లోపం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు అన్నబేది 20 గ్రాములు నిమ్మ ఉప్పుతో కలిపి పిచకారి చేయాలని సూచించారు. పంట కాలంలో విచక్షణారహితంగా పురుగుల మందులు వాడకుండా సమతుల్యంతో ఎరువులను వినియోగించి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చెరువులో గంబూషియా చేపలు విడుదల



చెరువులో గంబూషియా చేపలను విడిచిపెడుతున్న కార్పొరేటర్ వసంత

సింహాచలం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలి 97వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత తెలిపారు. డెంగ్యూ దోమల నివారణ నిమిత్తం 97వవార్డు పరిధిలోని కార్మికనగర్ కాలనీలో ఉన్న చెరువులో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వసంత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, మలేరియా డిపార్ట్‌మెంట్ ఉద్యోగి నాయుడు, కాలనీ నిర్వాసితులు రాజరావు, మంగరాజు, జగన్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం : సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. 95వ వార్డు పరిధి లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో గురువారం జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించే కార్యక్రమంలో ముమ్మన పాల్గొన్నారు. గర్భవతులు, బాలింతలు, తల్లులకు పది రకాల పోషకాహార సరకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం బాగుండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారన్నారు. దానిలో భాగంగానే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా గర్భవతులు, బాలింతలు, తల్లులకు పది రకాల పోషకాహార కిట్లను క్రమం తప్పకుండా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కె.సంతోష్, పార్టీ నాయకులు సీహెచ్ వెంకటరమణ, రాజశేఖర్, ఆర్పీ దేవి, 501 సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్‌కు డిమాండ్



ఆందోళనలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు



నినాదాలు చేస్తున్న కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ పనిచేస్తున్న కార్మికులకు డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ చేయాలని ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేట్ ఎదుట గురువారం భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించడానికి యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్టుల నెపంతో వేధింపులు ఆపాలన్నారు. కార్మికులకు ఎన్టీపీసీ లోగోతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్మికులకు రెండేళ్లుగా డస్ట్ అలెవెన్స్ అగ్రిమెంట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. రూ.2350 చెల్లిస్తామని చెప్పి నేటికి అగ్రిమెంట్ చేయకుండా కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని కార్మిక నేతలు ఆరోపించారు. మహారత్న పరిశ్రమగా ఉన్న ఎన్టీపీసీలో కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ కార్మికులు చేపట్టిన సమ్మె విజయవంతమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మిక నేతలు హెచ్చరించారు. మెయిన్‌గేటు నుంచి పరిపాలన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆందోళనలో కార్మిక నాయకులు జి.పెంటారెడ్డి, ఎల్.కంటిరెడ్డి, బొట్టా రమణ, సిఐటియు ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, పి.పోతినాయుడు, గోవిందరాజు, రామారావు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గత నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమలో భాగంగా 77వ వార్డులోని పిట్టవాని పాలెం, మరడ దాసరిపేటలో ఆయన పర్యటించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రాతిపదికగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాధనతోనే లక్ష్యం సాకారం

ఏయూ క్యాంపస్: నిత్యం క్రమపద్ధతిలో సాధన చేస్తే లక్ష్యం సాకారం అవుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించాలంటే ఆరు నెలల కాలం కష్టపడాలని సూచించారు. ఇతరులతో పోల్చుకోవడం మానివేయాలని, మన సామర్థ్యా లను బలోపేతం చేసుకోవడానికి ఆలోచన చేయాలన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



హేమలత (ఫైల్)

అల్లిపురం : కొత్తవలస మండలంలోని మంగళపాలెం వసంత విహార్ అపార్ట్‌మెంట్‌లో భర్త వెంకటేష్, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న సోడదాసి హేమలత (26) గత నెల 31వ తేదీన జగదాంబ థియేటర్‌లో మ్యాట్నీ సినిమాకు వెళ్లింది. సినిమా అనంతరం ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె భర్త వెంకటేష్ నగరంలో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఆమె హైదరాబాద్‌లోని అమెరికన్ ఐ హాస్పిటల్‌లో నర్సుగా ఉద్యోగం చేసేదని, అక్కడ రాజు అనే వ్యక్తి ఇబ్బంది పెట్టడంతో జాబ్ మానేసి వచ్చేసిందని తెలిపారు. కొంత కాలంగా రాజు ఫోన్‌లో ఇబ్బంది పెడుతున్నాడన్నారు. అతనిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో వెంకటేష్ పేర్కొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి

పరవాడ: మండలంలో మంత్రిపాలెం గ్రామానికి చెందిన ఎ.రాము (32) పురుగు మందు మృతి చెందినట్టు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. మంత్రిపాలెం గ్రామానికి చెందిన రాముకు కొంతకాలం నుంచి మానసిక స్థితి బాగోలేదు. మద్యం తాగుతూ ఎక్కడపడితే పడుకోవడం చేస్తుండేవాడు. ఈ క్రమంలో బుధవారం కూడా రాము మద్యం సేవించిన అనంతరం కొంత సేపటికి గిల గిల కొంటున్న తరుణంలో స్థానికులు గుర్తించి అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాము పురుగుల మందు సేవించినట్లు ఆస్పత్రి వర్గాలు గుర్తించి మెరుగైన వైద్యం కోసం బుధవారం సాయంత్రం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.